క్లుప్తంగా

నేడు ప్రత్యేకాధికారి పర్యటన

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం అమలును పరిశీలించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి సత్యంజన్ మంగళవారం రానున్నారు. ఆయన వన్‌ధన్ వికాస్ కేంద్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను పర్యవేక్షించనున్నట్టు అధికార వర్గాల సమాచారం.

10న వాహనాల వేలం


వేలం వేయనున్న వాహనాలు ఇవే

వీరఘట్టం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఐదు వాహనాలను ఈనెల 10న వీరఘట్టం పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు. వేలం వేయనున్న వాహనాల్లో ఒక ఆటో, రెండు స్కూటీలు, ఒక బైక్, ఒక మోపెడ్ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని ఎస్సై కోరారు.

పోలీసుల దర్యాప్తు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్, ఎస్ఐ నీలకంఠం

కొమరాడ: మండలంలోని కొరిశీల గ్రామ పరిసరాల్లో సందీప్ రవీంద్ర ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన ఇఎక్స్–100(చైన్ మిషన్)కు గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 6వ తేదీన నిప్పంటించి, ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కంపెనీ సూపర్‌వైజర్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ నీలకంఠంలు సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని, దర్యాప్తు చేశారు. ఏడేళ్లుగా ఇదే ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు చేస్తున్నామని, కొరిశీల నుంచి కెమిశీల రోడ్డు పనులు పూర్తయిన తర్వాత కొరిశీల సమీపంలో మిషన్ ఉంచగా, మిషన్ పైనుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి, కాలిపోయిందని కంపెనీ సూపర్‌వైజర్లు తెలిపారు. ఈ ఘటన ఎలా జరిగిందన్న దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస మంగ చెరువు ఆయకట్టు పరిధిలోని ఆక్రమణలు తొలగించాలని అదే గ్రామానికి చెందిన రైతులు అలజంగి శివుడు, త్రినాథ, కృష్ణ కోరుతున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ సెల్‌కు సోమవారం వెళ్లి, తహసీల్దార్ కె.విజయకు వారు వినతిపత్రం అందజేశారు. గతంలో పంటపొలాలకు వెళ్లేందుకు దారి ఉండేదని, ప్రస్తుతం ఆ దారిని కొంతమంది రైతులు ఆక్రమించుకోవడం వల్ల మిగతా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన తహసీల్దార్.. సర్వే చేసి చూస్తామన్నారు.

కిలో జీడిపిక్కలు రూ.185

కురుపాం: మార్కెట్‌లో జీడిపిక్కల ధర అమాంతం పెరిగింది. గత మూడు నెలలుగా కిలో జీడిపిక్కల ధర రూ.105 మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ ధర రూ.185కు చేరుకుంది. ఒక్కసారిగా రూ.80 ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉండడంతోనే ధర పెరిగిందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మొదటి రకం జీడిపిక్కలు రూ.185కు, రెండో రకం జీడిపిక్కలు రూ.140కు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సీజన్ ఆఖరిలో జీడిపిక్కల ధర పెరిగితే లాభమేమి ఉంటుందని, రైతుల వద్ద పంట దిగుబడి ఉన్నప్పుడు పెరిగితే కదా లాభం ఉంటుందని పలువురు అంటున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


కన్నయ్యగూడలో ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కన్నయ్యగూడ, జొల్లగూడ, కె.శివడ గ్రామాల్లో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దాం కమిటీ అధ్యక్షుడు రామినాయుడు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన గురుపౌర్ణమి పురస్కరించుకుని, ప్రతీ గ్రామంలో త్రైత సిద్ధాంతం గురించి తెలియజేస్తున్నామని తెలిపారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అని అనాలని, శ్రీకృష్ణుడు ఆషాఢమాసంలో మానవజన్మ ఎత్తాడని, అందుకే ఆయనను జగద్గురువుగా భావించి, గురుపూజ చేయాలన్నారు.


గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో జోహార్ వైఎస్సార్ అని నినదిస్తున్న ఎంపీపీ రామారావు తదితరులు


గరుగుబిల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఇందుమతి, తదితరులు


కురుపాంలోని రావాడ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత


కొమరాడ: విక్రంపురంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు


గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు


కొమరాడలో వైఎస్సార్ సేవలను కొనియాడుతున్న వైఎస్సార్ సీపీ నేత


కురుపాం: వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో కేకు కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


సీతంపేట: ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు


పాలకొండ: వైఎస్సార్ కూడలిలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు


వీరఘట్టం: తెట్టంగిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు


భామిని: కొరమ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు


కురుపాం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిను మరువం రాజన్నా..!

మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నిను మరువం రాజన్నా అంటూ జోహార్ వైఎస్సార్, వైఎస్సార్ అమర్‌రహే అని నినాదాలు చేశారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్రానికి సుపరిపాలన అందించిన మహానేత.. జలయజ్ఞం పేరిట సాగునీటి ప్రాజెక్టులు అందించిన రైతు బాంధవుడు.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దరిచేర్చిన విద్యాప్రదాత.. ఆరోగ్యశ్రీతో నిరుపేదలకు పునర్జన్మ ప్రసాదించిన ప్రాణదాత వైఎస్సార్ అని కొనియాడారు. పలుచోట్ల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, తమ అభిమానం చాటుకున్నారు. -పాలకొండ, కురుపాం

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి


ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు యంత్రాంగం పెద్దపీట వేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ నూతనంగా రూపొందించిన పీఆర్–1 యాప్‌లో రోజువారీ పారిశుధ్య పనుల వివరాలు, డ్రైన్స్ నిర్వహణ, పూడిక తీతలకు సంబంధించిన పురోగతిని అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

భామిని: మండలంలోని నేరడి–బి ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో హెచ్‌ఎం సిరిపురపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రతీ విద్యార్థి ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కాగా, ఇటీవల పాఠశాల వీడిన 8వ తరగతి విద్యార్థులు పాఠశాలకు మొక్కలను బహుమతిగా ఇచ్చారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై, ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కట్ చేసి, అందరికీ అందజేశారు. బర్త్‌డే కానుకగా వచ్చిన నోటుపుస్తకాలు, పెన్నులు, మిఠాయిలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థులకు పంచిపెట్టారు. అలాగే వైటీసీలోని గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు.

గుండిచామందిరానికి చేరిన జగన్నాథుడు


భామిని: దేవతామూర్తులకు పూజలు

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్ర ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గుండిచామందిరానికి తరలించారు. రథాన్ని లాగేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. గుండిచ మందిరంలో విగ్రహాలను ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో ప్రధాన మందిరంతో పాటు ఉప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పూరీ తరువాత అంతటి ప్రాసస్త్యం ఉన్న ఇక్కడి జగన్నాథస్వామి ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు తరలి వస్తున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టలేకపోయింది.

– భామిని: మండలంలోని బత్తిలిలో నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు ప్రతాప్‌చంద్ర సాహు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం శ్రీబృందావన చంద్రస్వామి మఠం నుంచి దేవతామూర్తుల విగ్రహాలను రథంపై అధిరోహించి గుండిచా మందిరం వైపు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జై జగన్నాథ నినాదాలతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి.

అవగాహన తప్పనిసరి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న భద్రగిరి ఐసీడీఎస్ పీవో సుశీలాదేవి

గుమ్మలక్ష్మీపురం: లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పీవోఎస్‌హెచ్)పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని భద్రగిరి, కురుపాం ఐసీడీఎస్ పీవోలు సీహెచ్ సుశీలాదేవి, కె.విజయగౌరి, ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్‌లు విద్యార్థినులకు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. ఓ స్త్రీని కన్ను ఆర్పకుండా చూడడం, సైగలు చేయడం, తాకడం, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం వంటి అనుచిత ప్రవర్తనను లైంగిక వేధింపుల కింద పరిగణిస్తారని, అలా చేసిన వారిపై ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చన్నారు. సురక్షితమైన, వేధింపులు లేని వాతావరణంలో స్త్రీలు తమకు నచ్చిన వృత్తిని లేదా వ్యాపారాన్ని చేసుకునే హక్కు ఉందని, స్త్రీల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జి.శ్రీదేవి, ఎస్.ఈశ్వరమ్మ, టి.అపర్ణ పాల్గొన్నారు.

పెదబుడ్డిడిలో 'నేను బడికి పోతా'


బాలుడి తల్లిదండ్రుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్న సహిత విద్య కో–ఆర్డినేటర్లు

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య కో–ఆర్డినేటర్ అమ్మినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ ర్యాలీలో కెల్ల గణేశ్వరరావు అనే 11 ఏళ్ల బాలుడిని ఇంతవరకు పాఠశాలలో చేర్పించలేదన్న విషయం తెలియవచ్చింది. ఈ మేరకు ఆ బాలుడి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ బాలుడిని చేర్పించేలా ఉపాధ్యాయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. సదరు విద్యార్థికి ఇంటి వద్దనే ప్రత్యేక ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తామని జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ పి.భానుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో బి.శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.మధుకిశోర్, బి.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

భామిని: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం సమావేశమవుతారని పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం తెలిపారు. వండువ గ్రామంలోని ఆమె స్వగృహంలో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

మోటార్ వెహికల్ చట్టాలపై అవగాహన

సీతంపేట: మోటార్ వెహికల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో సోమవారం నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటివి ధరించాలన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మూర శ్యామ్యుల్, సతీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య అవతారంలో జగన్నాథుని దర్శనం


పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

జియ్యమ్మవలస: రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా మండలంలోని చినమేరంగి గ్రామంలో కొలువైన జగన్నాథుడు మత్స్య అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. తుంబలి, చినమేరంగి, అల్లువాడ, చంద్రశేఖర రాజపురం, పిప్పలబద్ర, లక్ష్మీపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు


జియ్యమ్మవలస: చినమేరంగిలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బిల్లుల పుస్తకంతో పాటు స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక, లైసెన్స్, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిల్వలు ఉండి కూడా నిల్వలు లేనట్లు ధరలను ఇష్టానుసారంగా పెంచితే సహించేది లేదన్నారు. తనిఖీలు చేసిన వారిలో కోనసీమ జిల్లా పి.గన్నవరం నుంచి ఏడీఏ రామ్‌మోహన్‌రావు, విశాఖపట్నం నుంచి విజిలెన్స్ సీఐ తిరుపతిరావు, కురుపాం ఏడీఏ ఎ.నిర్మలాజ్యోతి, వ్యవసాయాధికారిణి హర్షలత ఉన్నారు.

గరుగుబిల్లి: నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.జె.వి.రామ్మోహనరావు, విజిలెన్స్ సీఐ సీహెచ్ తిరుపతిరావు హెచ్చరించారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్ వద్ద ఉన్న ఎరువుల షాపులో ఆయన తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలను స్టాక్ రిజిస్టర్లతో పోల్చి చూసి, వ్యత్యాసాలు గుర్తించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 64 మెట్రిక్ టన్నుల ఎరువులతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఈ తనిఖీల్లో ఏడీఏ ఎ.నిర్మలాజ్యోతి, మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తదితరులున్నారు.

నేడు ప్రజావేదిక

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, మంగళవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో ఎం.గౌరీనాథ్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని, మొత్తం 25 గ్రామపంచాయతీల్లో రూ.16.62 కోట్లకు సంబంధించి, పనులు జరిగాయని, వాటిని తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే సామాజిక పింఛన్ల పంపిణీపై కూడా ఆరాతీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు హాజరవుతారన్నారు.

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి


డీడీకి వినతిపత్రం అందిస్తున్న భాషా వలంటీర్లు

సీతంపేట: భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలంటూ భాషా వలంటీర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరకు వినతిపత్రం అందజేశారు. మిగతా జిల్లాల్లో భాషా వలంటీర్లను రెన్యువల్ చేయడంతో వారంతా పాఠశాలలకు వెళ్తున్నారని, సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న వారిని ఇంతవరకు రెన్యువల్ చేయకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే రెన్యువల్ చేయాలని సంఘ నాయకుడు డొంబు, తదితరులు కోరారు.

పబ్లిక్ గ్రీవెన్స్ వెలవెల

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. సమస్యలపై వినతులు సమర్పించేందుకు కొద్ది మంది మాత్రమే వచ్చారు. ఉదయం 10.30 గంటలకు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలంతో పాటు పలువురు అధికారులు వినతులు స్వీకరించడానికి వచ్చి కూర్చున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులు ఇచ్చేందుకు ఎవరూ రాలేదు. ఆ తరువాత కొద్ది మంది సమస్యలపై వినతులిచ్చారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి


మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

సీతంపేట: మలేరియాతో బాధపడుతూ వెన్నలవలస ఆశ్రమ పాఠశాలలో మృతిచెందిన బిడ్డిక రస్మిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అచ్చెబ గ్రామంలో మృతురాలి కుటుంబాన్ని గిరిజన సంఘ నాయకులు బి.అప్పారావు, ఎం.తిరుపతిరావు, భాస్కరరావు, దుర్గారావు, తదితరులు సోమవారం పరామర్శించారు. ఈ సంవత్సరమే వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలలో చేరిందని, జ్వరం వచ్చి మూడు రోజులైందని, సరైన ట్రీట్మెంట్ అందక మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ పరిస్థితికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.